క్లుప్తంగా

'పిచ్చి మొక్కలు తొలగించండి'



మొక్కలకు నీరు పడుతున్న సిబ్బంది

కెరమెరి: పల్లె ప్రకృతి వనంలో, నర్సరీల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ధనోరా, గోయగాం గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అధిక మంది కూలీలు పనులకు వచ్చేలా చేడాలని టీఏ, ఎఫ్ఏలను ఆదేశించారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్

కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కామ్డే తుల్సిరాం ప్రారంభించారు. గ్రామ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వికాస్, హెచ్ఏ వసంత్ రావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి



పనులు పరిశీలిస్తున్న వంశీకృష్ణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేట, జుబ్లీమార్కెట్, హడ్కో కాలనీల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ మంగళవారం మురుగు కాలువల్లో పూడికలు తీయించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలుగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఉదయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దుర్గం తుల సీరాం తండ్రి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ దుర్గం రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, నాయకులు సముద్రాల రాజన్న, సిరిపురం రాజేశ్వర్, ఇలియాస్, కొండయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

దహెగాం: ఇటీవల నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచి పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. బాలికల ఫుట్‌బాల్‌లో అంజలి, తేజ, సంధ్యారాణి, రజిత, శిరీష, స్వాతి, బాలుర ఫుట్‌బాల్‌లో ఉదయ్‌కుమార్, విజయ్‌కుమార్, దేవిదాస్, పవన్‌కుమార్, ఖోఖోలో రాజేశ్వరి, అక్షయ, కబడ్డీలో ఇస్తారిలు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

'పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు'

నస్పూర్: పేదల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. కాలనీలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. పలు సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకురాగా సింగరేణి, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కౌలు ధరలకు రెక్కలు

- ఆందోళనలో కౌలు రైతులు
- ఏటేటా పెరుగుతున్న ధరలు
- రైతుబంధు వచ్చినా తగ్గించడం లేదని ఆవేదన
- ఎకరానికి రూ. 12వేల నుంచి రూ. 15 వేలు



కౌటాలలో కౌలుకు తీసుకున్న భూమిని దున్నుతున్న రైతు (ఫైల్)

కౌటాల: జిల్లాలో ఏటా అతివృష్టి, అనావృష్టి వంటి కారణాలతో పంటలు బాగా పండకపోయినా కౌలు ధరలు మాత్రం పైపైకి పెరుగుతున్నాయి. సాగు మీద ఉన్న ప్రేమతో కౌలు రైతులు ఎంత ధరైనా చెల్లిస్తున్నారు. ఈ యేడు కాకపోయినా మరో ఏడాదైనా దిగుబడులు వస్తాయనే ఆశతో భూములను కౌలుకు తీసుకుంటున్నారు. ఎన్నో కష్టాలు పడుతున్న కౌలు రైతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ పథకాలు సైతం కౌలు రైతులకు అందకపోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

రైతుబంధు వస్తున్నా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఒక లక్ష 45 వేల వరకు రైతులున్నారు. వారిలో సుమారు 35 వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. వానాకాలం సమీపిస్తుండడంతో కౌలు రైతులు భూ యజమానుల దగ్గర కౌలు మాట్లాడుకుంటున్నారు. దిగుబడి వచ్చినా.. రాకపోయినా.. రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేలు భూ యజమానులకు ప్రభుత్వం సాయం చేస్తున్నా కౌలు ధరలు మాత్రం తగ్గడం లేదు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి పథకాల్లో కౌలు రైతులకు నయాపైసా వచ్చేది లేదు. చివరకు పంట రుణాలు కూడా వారికి అందని పరిస్థితి ఉంది. దీంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నా కౌలు రైతులు చివరకు నష్టాలనే చవిచూస్తున్నారు. 2011 భూ ఆధీకృత సాగుదారుల చట్టం ప్రకారం ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు వ్యవసాయ శాఖ గ్రామ సభలు నిర్వహించి భూ యజమానులకు అవగాహన కల్పించి, కౌలు రైతుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలి. కానీ ఇటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

భూమి రకాన్ని బట్టి కౌలు ధర..

ఏ ప్రాంతమనే తేడా లేకుండా ఎక్కడ భూమి దొరుకుతుందా అని పత్తి సాగుదారులు అన్వేషిస్తున్నారు. రైతులను ఒప్పించి ఒప్పందం చేసుకోవడానికి తహతహలాడుతున్నారు. భూమి రకాన్ని బట్టి కౌలు ధరను నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నల్లరేగడి, ఎర్రరేగడి, పలు రకాల భూముల కోసం ఎకరానికి రూ .12 వేల నుంచి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. పత్తి సీజన్ ముగిసేవరకు మాత్రమే లీజు ఒప్పందం చేసుకుంటున్నారు. రహదారి పక్కన, సాగు నీటి సౌకర్యం ఉన్న భూములకు అదనంగా మరికొంత కౌలు చెల్లిస్తున్నారు. చేను భూములకు ఎకరానికి రూ. 12 వేల - రూ. 15 వేలు, వరి పంట పొలాలకు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ. 12వేల వరకు కౌలు ధర ఉంది. ఇప్పటికే కొంత మంది రైతులు భూమి కౌలుకు ఇవ్వడానికి ఒప్పందం చేసుకోగా, ఇంకా కౌలు భూముల కోసం జోరుగా యత్నాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఎకరాకు రూ.18 వేలు ధర చెల్లించాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. కాగా భూ యజమానులు కౌలు ధరలు తగ్గించాలని మండల కౌలు రైతులు కోరుతున్నారు.

భూముల కోసం తిరుగుతున్నారు



గతంలో కౌలు భూమి ఎకరానికి రూ.6వేల నుంచి రూ.8వేలు ఉండేది. ఒకరిని చూసి మరొకరు పత్తి పంట సాగు చేయడంతో ఒక్కసారిగా ధర పెరిగింది. ఎకరానికి రూ. 10వేలు ఇస్తామన్న భూమి దొరకడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో కౌలు భూముల కోసం బాగా తిరుగుతున్నారు.

– రవి, రైతు, తలోడి

కౌలు రైతులను ఆదుకోవాలి



ఏటా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. దిగుబడి వచ్చినా, రాకపోయినా భూ యజమానులకు కౌలు చెల్లించాల్సి వస్తోంది. తమ దయనీయ పరిస్థితి చూసైనా కౌలు ధర తగ్గించడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– దిగంబర్, కౌలురైతు, యాపలగూడ

పనితీరే ప్రామాణికం



దహెగాం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ నిర్ణయం
- త్వరలోనే జిల్లా కమిటీల ఏర్పాటు

కౌటాల(సిర్పూర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు వారి పనితీరే ప్రామాణికం కానుంది. గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే జేపీఎస్‌ల సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించాలని సోమవారం సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జేపీఎస్ పనితీరును మదింపు చేసేందుకు జిల్లా కమిటీలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. రెగ్యులరైజేషన్‌పై ముందడుగు పడటంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి కమిటీ నియామకం

జేపీఎస్‌ల పనితీరు మదింపు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), జిల్లా అటవీశాఖ అధికారి, ఎస్పీ లేదా డీసీపీలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి కమిటీలు రూపొందించిన నివేదికలను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మరోసారి పరిశీలన చేస్తారు. ఆ నివేదిక ఆధారంగానే క్రమబద్ధీకరణపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

కల సాకారం..

జిల్లాలో 335 పంచాయతీలు ఉన్నాయి. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతోపాటు 209 మంది జేపీఎస్‌లు, 58 మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. సర్వీసు క్రమబద్ధీకరణ కోసం జేపీఎస్‌లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి హామీతో తిరిగి విధుల్లో చేరారు. ఇటీవల నిర్వహించిన కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించారు. సోమవారం క్రమబద్ధీకరణ ప్రక్రియ విధివిధానాలు రూపొందించాలని ఆదేశించడంతో జేపీఎస్‌ల కల త్వరలోనే సాకారం కానుంది.

గ్రామాభివృద్ధికి పాటుపడతాం



మా కష్టాన్ని గుర్తించి ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వం నిర్ణయంతో బాధ్యత మరింత పెరిగింది. ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడుతాం.

– శాలిని, జేపీఎస్, బోదంపల్లి

ప్రక్రియ పూర్తి చేయాలి



పనితీరును గుర్తించి జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించడం చాలా సంతోషంగా ఉంది. త్వరగా విధివిధానాలు రూపొందించి కమిటీ ఏర్పాటు చేయాలి. జాప్యం లేకుండా ప్రక్రియగా వేగవంతంగా పూర్తిచేయాలి. ఓపీఎస్‌లను కూడా జేపీఎస్‌లుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– కృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

గాలివాన బీభత్సం



కాగజ్‌నగర్ మండలం గాంధారి మైసమ్మ సమీపంలో రోడ్లపై పడిన చెట్లు



రోడ్డుపై పడిపోయిన చెట్లను సిబ్బందితో కలిసి తొలగిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

దహెగాం: మండలంలోని ఇట్యాల, కోత్మీర్, రాళ్లగూడ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కాగజ్‌నగర్ మండలం ఎక్స్‌రోడ్ మధ్యలో గాంధారి మైసమ్మ వద్ద గాలి వానకు చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో మంగళవారం అకాల వర్షం కురిసింది. కాగజ్‌నగర్ పట్టణంలో రాళ్లవర్షం కురవగా మండలంలోని వంజీరి వద్ద ఆసిఫాబాద్– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ మార్గం గుండా వెళ్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్ తన సిబ్బందితో రోడ్డుపై పడిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. చెట్ల కొమ్మలు విరిగి కరెంట్ స్తంభాలపై పడడంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిర్పూర్ పేపర్‌మిల్లు ప్రధాన రహదారి సమీపంలోని ఎస్పీఎం క్వార్టర్లలో భారీ చెట్లు ప్రహరీపై పడ్డాయి.

ప్రతీ ఒక్కరికి పని కల్పించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

సిర్పూర్(టి): గ్రామాల్లోని కూలీలకు ప్రతీ ఒక్కరికి ఈజీఎస్ పనులు కల్పించాలని మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీలో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు వేసవిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఈవో కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బెజ్జూర్: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన మల్లయ్యకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.56వేల చెక్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కొద్ది రోజుల క్రితం మల్లయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారని పీఏసీఎస్ మాజీ చైర్మన్ జోకే వెంకన్న అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో చెక్కు మంజూరు కాగా అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పుల్లూరి సతీష్, సెగ్యం వినోద్, బాషబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కెరమెరి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యూలరైజేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు నిర్ణయం ప్రకటించడంతో మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, జేపీఎస్‌లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కుమురం న్యానేశ్వర్, జేపీఎస్ సంఘం గౌరవాధ్యక్షుడు మల్లేశ్, జేపీఎస్, ఓపీఎస్‌లు ఉన్నారు.

దహెగాంలో..

దహెగాం: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేస్తామని హామీ ఇవ్వడంతో మండల పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ప్రణీత్ బాబు, వంశీక్రిష్ణ, శివప్రసాద్, గోమాస శివ, చౌదరి రాజేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు శేని తిరుపతి మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల పనితీరును ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, ఓపీఎస్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, సర్పంచులు వొజ్జల మౌనిక, రమేశ్, సోమయ్య, శంకరమ్మ, ఎంపీవో మౌనిక, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు సాయికృష్ణ, భాస్కర్, గణేష్, రజిత, రాజేశ్వరి, శాలిని పాల్గొన్నారు.

వరిధాన్యం తూర్పార యంత్రాల పంపిణీ



యంత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వరిధాన్యం తూర్పార యంత్రాలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 22 వరి కొనుగోలు కేంద్రాలకు రైతుల సౌకర్యార్థం వరిధాన్యం క్లీనింగ్ (తూర్పార) యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాధిక్ అలీ

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో కబ్జా కాలమ్ లేకపోవడంతో ఏళ్లుగా భూమిపై కాస్తులో ఉన్న వారికి హక్కులు లేకుండా పోతున్నాయన్నారు. పట్టా మార్పిడికి పాత పట్టాదారులు డబ్బులు డిమాండ్ చేయడం, లేక తిరుగుబాటు చేయడం వంటివి చేస్తున్నట్లు అధ్యాయనంలో వెల్లడైందన్నారు. అనంతరం ఇటీవల హైకోర్టు ప్రభుత్వానికి జారీ చేసిన ఉత్తర్వుల తెలుగు అనువాద పత్రాలను తహసీల్దార్ సాయన్నకు అందించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ సభ్యులు అశ్రఫ్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభను విజయవంతం చేయండి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభకు హాజరయ్యే అధికారులు గతంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర వివరాలతో హాజరు కావాలని కోరారు.

పశువుల ఆసుపత్రికి దారేది..?

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- వర్షాకాలంలోపు రోడ్డు వేయాలని వేడుకోలు



రాస్పెల్లిలోని పశువైద్య కేంద్రం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలో గల ప్రాథమిక పశువైద్య కేంద్రానికి దారి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పశువుల వైద్య కేంద్రానికి మండలంలోని రాస్పెల్లి, కొత్త సారసాల, పాత సారసాల, గొర్రెగూడ, మన్నెగూడ, గజ్జిగూడ, మోసం తదితర గ్రామాల రైతులు పశువులను చికిత్స నిమిత్తం తీసుకొస్తుంటారు. అయితే పశువైద్య కేంద్రానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతం. వర్షం పడితే మోకాళ్లోతు బురదలో నుంచి ఆస్పత్రికి పశువులను తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. పశువైద్య కేంద్రం చుట్టూ చెట్లపొదలు, చెత్తాచెదారం ఉండటంతో పాములు, తేళ్లు వస్తున్నాయని ఆసుపత్రి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పశువైద్య కేంద్రానికి రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలంలోగా పశువైద్య కేంద్రం వరకు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

పశువైద్య కేంద్రానికి రోడ్డు వేయాలి



పశువైద్య కేంద్రానికి వర్షాకాలంలో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. చిన్న పాటి వర్షం పడినా మోకాళ్లోతు బురదలో వెళ్లాల్సిన పరి స్థితి ఉంది. వర్షాకాలంలోపు రోడ్డు నిర్మించాలి.

– గజ్జి ప్రవీణ్, యువరైతు, రాస్పెల్లి

బీమా సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు టీజీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జన సురక్ష పథకాలతో ప్రజలకు ఆర్థికంగా మేలు కలుగుతుందన్నారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కారోబార్ రమణాచారి, నాందేవ్, అశోక్, దేవయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'పల్లెపల్లెకు పాల్వాయి' పాదయాత్ర



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు

సిర్పూర్(టి): పల్లెపల్లెకు పాల్వాయి –గడపగడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని చింతకుంట, హీరాపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పర్యటించారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు గడ్డం రంగయ్య, వినోద్, రాజేందర్, సతీష్, రాజేష్, శ్రావణ్, పురుషోత్తం పాల్గొన్నారు.